వద్దనుకుంటున్నారా..?

- రామవరంలో సింగరేణి సూపర్‌బజార్ పునరుద్ధరణపై నీలినీడలు
- గతంలోనే బడ్జెట్ కేటాయించినా ముందుకు సాగని పనులు
- సింగరేణి యాజమాన్యం స్పందించాలని స్థానికుల వినతి



శిథిలావస్థకు చేరిన సింగరేణి సూపర్‌బజార్ భవనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో శిథిలావస్థకు చేరిన సింగరేణి సూపర్‌బజార్‌ను పునర్ నిర్మించి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ ఏరియాలో సుమారు 16 వేల మంది స్థానికులు, కార్మికులు నివసిస్తున్నారు. ఇక్కడ సూపర్‌బజార్ నిర్మిస్తే వీరికే కాక పరిసర ప్రాంతాలైన గరీబ్‌పేట, త్రీ ఇంక్‌లైన్, 4 ఇంక్‌లైన్, గరిమెళ్లపాడు, చిట్టిరామవరం, లక్ష్మీపురంతండా, సీతంపేట, నిమ్మలగూడెం, మేషన్‌కాలనీ, ఎస్సీకాలనీల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. సూపర్‌బజార్‌కు తోడు బ్యాంకు, పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

1974లో ఏర్పాటు..

రామవరం మార్కెట్ సెంటర్‌లో కార్మికుల కోసం సింగరేణి యాజమాన్యం 1974లో సింగరేణి సూపర్‌బజార్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రైవేట్ షాపులతో పోలిస్తే తక్కువ ధరకే అందించేవారు. కొంతకాలం సజావుగానే సాగినా సుమారు ఇరవై ఏళ్ల కిందట సూపర్‌మార్కెట్ తొలగించారు. దీంతో కార్మికులు ప్రైవేట్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి తోడు నిర్వహణ లేక భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని 15 ఏళ్ల కిందట ఏరియా అధికారుల దృష్టికి కార్మిక సంఘాల నాయకులు పలుమార్లు తీసుకెళ్లగా పునరుద్ధరణకు సిద్ధమయ్యారు. ఈ మేరకు 2010లో నాటి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి అవసరమైన సుమారు రూ.30 లక్షలు కూడా కేటాయించారు. అంతలోనే ఏం జరిగిందో కానీ ఆ ప్రతిపాదనలు మూలన పడ్డాయి. ఫలితంగా అప్పటి నుంచి కార్మికులు, వారి కుటుంబాలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ప్రస్తుత అధికారులైనా స్పందించి పాత ప్రతిపాదనల ఆధారంగా సూపర్ బజార్‌కు కొత్త భవనం నిర్మించడమే కాక బ్యాంకు, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



రామవరంలో సూపర్‌బజార్ భవనం స్థానంలో కొత్తది నిర్మించి బ్యాంకు, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో ఇందుకు ప్రతిపాదనలు సిద్ధమైన విషయాన్ని వివరించాం. ఇది జరిగితే రామవరం ఏరియాకు పూర్వ వైభవం వచ్చే అవకాశముంది.

–ఎండీ రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

అభివృద్ధికి సింగరేణి సహకరించాలి



గతంలో రామవరంలో కళాశాల, సూపర్‌బజార్, బ్యాంకు, లైబ్రరీ ఉండేవి. కళాశాల భవనం శిథిలమైతే ఆ స్థలాన్ని పార్క్‌కు కేటాయించారు. సీఎస్సార్ పాలసీలో భాగంగా రామవరం ఏరియాను యాజమాన్యం అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని పలుమార్లు విన్నవించాం.

–ముస్తఫా, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

నృత్య పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

పాల్వంచ: ఈ నెల 17వ తేదీన హైదరాబాద్ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ఆడిటోరియంలో కార్తీక మాసం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శనల్లో పాల్వంచ జి.సంతోషమాత నిలయం నుంచి నాట్యాచారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో 21 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. విద్యార్థులకు డాక్టర్ ప్రసన్నరాణి చేతుల మీదుగా త్రిపురి బుక్ ఆఫ్ రికార్డ్ గుర్తింపు సర్టిఫికెట్లు, వరలక్ష్మికి అవార్డు అందించారు. సోమవారం పట్టణ ప్రముఖులు వారిని అభినందించారు.

నేడు మండల మహాసభ



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: మూడేళ్లకోసారి గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మహాసభలు నిర్వహించుకునే ఏకైక పార్టీ సీపీఎం అని, మంగళవారం పార్టీ మండల మహాసభ ఉంటుందని పార్టీ మండల కార్యదర్శి నబీ అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభకు రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేశ్ పాల్గొంటారని తెలిపారు. ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, జైబున్నిసా, కొడెం బోస్, విజయ్‌మోహన్‌సింగ్, సుజాత, కృష్ణ, రాజశేఖర్, పద్మ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నర్సింహారావు



నర్సింహారావు

టేకులపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా ఈసం నరసింహారావును సోమవారం ఎన్నుకున్నారు. టేకులపల్లిలో నిర్వహించిన సీపీఎం ఏడో మండల మహాసభలో ఈ ఎన్నిక జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. కమిటీ సభ్యులుగా కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, కుంజా రమేశ్, ధనసరి వీరస్వామి, దొడ్డ సావిత్రి, దొడ్డ సంపత్, పాయం వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన చెప్పారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం (బీఏఎస్ఎస్) పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, టీజీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రమాదేవికి వారు వినతిపత్రం అందించి మాట్లాడారు. బీఏఎస్ఎస్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ రూ.వందల కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు.

పోడు సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గిరిజన రైతుల పోడు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు పలువురు వినతిపత్రం అందజేశారు. పోడు భూములు సర్వే చేసి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను గతంలో ఐటీడీఏ అధికారులు పంపిణీ చేశారని, ఆ రైతులకు గత ప్రభుత్వం రైతుబంధు కూడా విడుదల చేసిందన్నారు. కానీ, అటవీశాఖ అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు చెల్లవని పేర్కొంటూ ట్రెంచ్ కటింగ్ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా పోడు సమస్యను పరిష్కరించాలని, గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్నపాక సత్యనారాయణ, వడ్ల శ్రీనివాస్, ఎట్టి హరికృష్ణ, ఆదూరి రవి, అప్పల మురళీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..



ధర్నా చేస్తున్న వీఓఏలు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలో వీఓఏలుగా పనిచేస్తున్న అందరినీ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తామని కనీస వేతనం రూ.20,000 ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట 48 గంటల ధర్నాలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిలకర పద్మ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. 48 గంటల ధర్నా అనంతరం ప్రభుత్వంలో చలనం వచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్‌లో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుల్తానా, చంద్ర, లీల, నాగరాజు, రాము, రవి, పద్మ, రవి, మున్నీసా, అరుణ, అనురాధ, రమాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయండి



మాట్లాడుతున్న గోవిందు నరేశ్‌మాదిగ

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపి వేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామిమాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడు ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సమీక్షలో వారు మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకొచ్చిన తరువాతే ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లగట్ల స్వామి, చెంగల గురునాథం, దిబ్బెందుల సాయికుమార్, వేపూరి వెంకటేశ్వర్లు, ఇసనపల్లి కృష్ణ, తూర్పుగంటి అంజయ్య, కొత్తపల్లి సోమయ్య, రేపంగి రమణయ్య, వంగూరి రామ్మూర్తి, వేల్పుల సూర్యవాణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పాల్వంచ: పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అయ్యప్పనగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు నూకల రంగారావు, కొండం వెంకన్నతో పాటు జాలే జానకీరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కాల్వ భాస్కర్, నారాయణరావు, మధుసూదన్‌రావు, కందుకూరి రాము, చింతా నాగరాజు, వెంకటాచారి, చాంద్ పాషా, సుందర్ రావు, సత్యనారాయణ, రోశయ్య చౌదరి, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర కల్యాణం



పార్వతి, రామలింగేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణంలోని ఎన్ఎండీసీకాలనీలోని పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా పార్వతి రామలింగేశ్వర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సర్వదేవరభట్ల ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

ఇల్లెందురూరల్: ఫార్మాసిటీ ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు వాంకుడోత్ రమేశ్ డిమాండ్ చేశారు. పోలారం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సేవాలల్ సేన మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి అనువుగా లేని భూముల్లో ఏర్పాటు చేయాల్సిన పరిశ్రమలను సాగు భూముల్లో ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకోవడం విచారకరమన్నారు. తమ భూములు తీసుకోవద్దన్న గిరిజన రైతులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని చెప్పారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పాల్వంచరూరల్: ఫార్మా కంపెనీల పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా సేవాలాల్ సేన ఆధ్వర్యంలో తలపెట్టిన చలో గాంధీభవన్ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సేవాలాల్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను, మండల అధ్యక్షులు పవన్‌కల్యాణ్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీగా సత్యనారాయణ



గోచికొండ సత్యనారాయణ

ఇల్లెందు: ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీగా ఇల్లెందుకు చెందిన సీనియర్ నాయకుడు గోచికొండ సత్యనారాయణను నియమించారు. సోమవారం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ప్రకటించిన కమిటీలో ఇల్లెందు పట్టణానికి చెందిన సత్యనారాయణకు స్థానం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

ఐక్యతకు ప్రతీక

ఇల్లెందురూరల్: మండల, పట్టణ పరిధిలో ఆర్యవైశ్యులు తమలోని ఐక్యతను చాటుకుంటూ వనమహోత్సవాన్ని విజయవంతం చేశారని సంఘం పట్టణ, మండల అధ్యక్షులు అర్వపల్లి రాధాకృష్ణ, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పుల్లూరు సతీశ్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఏటా నిర్వహించినట్లుగానే ఆర్యవైశ్యుల వనసమారాధన ఈ సారి కూడా నిర్వహించగా.. నిర్వహణ కమిటీ విజయవంతంగా ఏర్పాట్లు పర్యవేక్షించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని ఆర్యవైశ్యులందరూ భవిష్యత్‌లోనూ కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

అభివృద్ధిపై పట్టింపు లేదు..

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బొమ్మెర శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తరతరాలుగా ఏజెన్సీ ప్రాంతాన్ని నమ్ముకొని జీవిస్తూ, అభివృద్ధి లేక అవస్థలు పడుతున్నారని, అగ్రవర్ణ పాలకవర్గ ప్రభుత్వాలకు కనువిప్పు కలగకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

ప్రజలు మురిసేలా అభివృద్ధి చేస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగూడెం పట్టణం మెరిసేలా.. ఇక్కడి ప్రజలు మురిసేలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16, 18, 21, 22వ వార్డుల్లో రూ.1.70 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన, 17, 19 వార్డుల్లో రూ.2.20 కోట్లతో పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడారు. ప్రజల మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గాన్ని మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని, అధికారులు పనులను పర్యవేక్షించాలని, నాణ్యత లోపిస్తే చర్యలకు సిఫారసు చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, కమిషనర్ శేషాంజన్ స్వామి, డీటీ అంజద్‌పాషా, డీఈ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌చౌహాన్ పాల్గొన్నారు.

ధ్వంసమైన డ్రెయినేజీ పరిశీలన

మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు మేదరబస్తీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన డ్రెయినేజీ ధ్వంసం కావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం పరిశీలించారు. సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీపై ఉద్యమం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలల్లో ఫీజుల దోపిడీ అడ్డుఅదుపు లేకుండా సాగుతోందని పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి.అజయ్, చంద్ర అరుణ తెలిపారు. సోమవారం ఇల్లెందులోని మాస్‌లైన్ (ప్రజాపంథా) కార్యాలయంలో దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని ముద్రించిన కరత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్పొరేట్ వైద్యశాలల ఫీజుల దోపిడీ కారణంగా 3 నుంచి 4 శాతం ప్రజలు పేదలుగా మారుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ సర్వేలో తేలిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వసతులు మెరుగు పర్చని కారణంగా సరైన వైద్యం అందటం లేదని, దీనిని ఆసరగా చేసుకున్న ప్రైవేట్ వైద్యశాలలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. వైద్యశాలల్లో దోపిడీకి వ్యతిరేకంగా పీవైఎల్, పీఓడబ్ల్యూ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్వీ రాకేశ్, వై.సావిత్రి, ధరావత్ దేవా, కిచ్చల కల్పన, రామకృష్ణ, యనగంటి గణేశ్, పూనెం మంగయ్య, కుమార్, కోటి, సరోజిని, ముత్తక్క, దుర్గక్క, సరిత, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి

జూలూరుపాడు: కొత్త డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేయాలని జూలూరుపాడు ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో గ్రామ దీపికలు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి సంబరాల్లో భాగంగా కొత్త గ్రూపులు ఏర్పాటు చేయడంతో పాటు, స్వయం సహాయక సంఘాల్లో ఇప్పటి వరకు సభ్యులుగా చేరని మహిళలను గుర్తించి చేర్పించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు ఇప్పించి చిన్న వ్యాపారాలతో ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని చెప్పారు. పేరటి కోళ్లు, బాతులు, పందులు, కొర్రమీను చేపల పెంపకంతో ఆర్థికంగా బలోపేతం కావొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం సత్యనారాయణ రాజు, సీసీలు బండ్ల మధుసూదన్‌రావు, ధరావత్ నాగేశ్వరరావు, పి.రామారావు, పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం గర్హనీయం..



సమావేశంలో మాట్లాడుతున్న డానియేల్

ఇల్లెందు: రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేతలు విమర్శించడం గర్హనీయమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్ మాట్లాడారు. మునుపెన్నడూ లేని విధంగా రైతుల రుణాలను తమ ప్రభుత్వమే మాఫీ చేసిందన్నారు. అయితే, లగచర్ల ఘటనను అడ్డుగా పెట్టుకుని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఆమె నియోజకవర్గానికి చేసిందేమీ లేదని తెలిపారు. నాయకులు సుదర్శన్ కోరీ, పడిదల నవీన్, జాఫర్, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, సిరిమల్లే రాజు, జాఫర్, శంకర్, కమల్ కోరీ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా, అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. 30వ వార్డు మధురబస్తీలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై బీఎస్పీ ఆధ్వర్యంలో ఇటీవల హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశామన్నారు. న్యాయమూర్తి ఆ లేఖను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీకి సిఫార్సు చేయగా వారు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని, మున్సిపల్ కమిషనర్ ఈ నెల 1వ తేదీన బిల్డింగ్ సీజ్ చేయనున్నట్లు నోటీసులు జారీ చేశారని చెప్పారు. దీనిపై స్థల యజమాని హైకోర్టులో ఈ నెల 5వ తేదీన రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయమూర్తి లక్ష్మణ్.. సదరు నిర్మాణాలను ఏడు రోజుల్లో సీజ్ లేదా కూల్చివేయాలని ఆదేశించారని చెప్పారు. ఆ ఆదేశాలను కూడా పాటించని కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ జోక్యం చేసుకుని నిర్మాణాలు కూల్చాలని కోరారు. మాలోత్ వీరునాయక్, జెట్టి ఆనందరావు, వంగా రవిశంకర్, కవిత, దీపిక పాల్గొన్నారు.

సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయండి..



పాల్వంచరూరల్: సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పాల్వంచరూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వైపీపీ రమణ ఆదేశించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు చేసిన సర్వే రిపోర్టును పరిశీలించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా నిర్వహించాలని, సేకరించిన వివరాలను ఆన్‌లైన్ చేయడంలో జాప్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, కార్యదర్శి సాయిరాం, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా జరగాలి

ఇల్లెందు: పట్టణంలో సాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే సక్రమంగా సాగాలని కుల గణన కూడా ఎలాంటి అవకతవకలు లేకుండా చేయాలని బీసీ సంఘాలు నేతలు, పీఎస్ఆర్ సంస్థ నాయకులు అవునూరి గణేశ్ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొండూరి రాజీవ్, రిత్విక్, కంది సదానందం తదితరులు ఉన్నారు.

73.23 శాతం సర్వే పూర్తి

ఇల్లెందురూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో వేగవంతంగా సాగుతోంది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 18,705 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 73.23 శాతంతో 13,698 కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేశారు. గ్రామాల్లో ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్ పర్యటిస్తూ ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్న అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.